తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



శ్రీహరికోటలో ఈ నెల 14న ప్రయోగానికి సిద్ధమైన ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్

# జాబిల్లి కోసం ఆకాశమల్లే !

## చంద్రయాన్-3 ప్రయోగ ముహూర్తం దగ్గరవుతోంది
## షార్‌లో తుది ఏర్పాట్లు, వివిధ పరీక్షలు - అందరి చూపు ఎల్‌విఎం3-ఎం4 రాకెట్‌పైనే

శ్రీహరికోట (తడ), జూలై 10 ప్రభాతవార్త

జాబిల్లి రాక కోసం, వెన్నెల వెలుగుల కోసం పక్షం రోజులకోసారి ఆకాశం ఏ విధంగా ఎదురు చూస్తుందో, చంద్రయాన్-3 ప్రయోగం కోసం దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి ఈ నెల 14న మధ్యాహ్నం 2.35 గంటలకు చంద్రయాన్-3ని ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే 3900 కిలోల బరువైన చంద్రయాన్ భద్రంగా ఎల్‌వీఎం3 రాకెట్‌లో గువ్వలా ఒదిగి ఉంది. ఈ శాటిలైట్‌ను ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ నిర్ణీత కక్ష్యలోకి చేర్చవలసి ఉంది. ప్రస్తుతం రాకెట్‌కు సంబంధించిన తుది పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక లాంచ్ రిహార్సల్స్ ముగించుకొని ఎల్‌ఎబి సమావేశంలో సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొనాల్సి ఉంది. మిషన్ సంసిద్ధత సమావేశం కూడా ముగిసిన తర్వాత రాకెట్‌ను ప్రయోగానికి సిద్ధం చేస్తారు. ఈ కార్యక్రమాలన్నీ ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో జరగనున్నాయి. రాకెట్ ప్రయోగం కోసం దేశ ప్రజలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అంతరిక్ష శాస్త్రవేత్తలు కూడా ఎదురు చూస్తున్నారు.

**ఇది అత్యాధునిక ఉపగ్రహం**

ప్రపంచంలోని అంతరిక్ష శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు గ్రహాల పరిశోధనల కోసం అద్భుతాలే సృష్టిస్తున్నారు. చంద్రయాన్-3 కూడా అలాంటిదే. చంద్రునిపై పరిశోధనలు శాస్త్రవేత్తలకు కొత్తకాదు. అయితే ప్రస్తుతం ప్రయోగిస్తున్న చంద్రయాన్-3లో కూడా విశ్వవ్యాప్తంగా అవసరమైన పరిశోధనల కోసం అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించారు. ఈ పరిశోధనలతో చంద్రునిపై ఉన్న అద్భుత రహస్యాలను కనుక్కొని ప్రపంచ మేధావులు అటువైపు దృష్టి సారించి భారత్‌కు జేజేలు పలికే విధంగా తమ సామర్థ్య ఉంటుందని ఇస్రో పెద్దలు కూడా నమ్ముతున్నారు. గతంలో మంగళ్‌యాన్ ప్రయోగం మొదటిసారి విజయవంతమైంది. చంద్రయాన్-1, చంద్రయాన్-2 కూడా పాక్షిక విజయాలు సాధించినప్పటికీ మన సాంకేతిక సామర్థ్యం ప్రపంచానికి తెలిసి వచ్చింది. ఇప్పుడు చంద్రయాన్-3 ఆ దిశలో దిగ్విజయం సాధిస్తే త్వరలోనే సూర్యగ్రహంపై పరిశోధనల కోసం ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని పంపించడానికి ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు.



రాకెట్ శీర్షభాగంలో గువ్వలా భద్రంగా ఉన్న చంద్రయాన్-3 ఉపగ్రహం

## వదిన జీవితంలో ఆనందం నింపాలని...
# తాగుబోతు అన్నను కడతేర్చిన చెల్లెలు



హత్యకేసులోని నిందితులతో పోలీసులు

చౌడేపల్లి, జూలై 10 ప్రభాతవార్త

పనీపాట లేకుండా నిత్యం తాగొచ్చి భార్యను హింసిస్తున్న అన్న నుంచి వదినకు విముక్తి కల్పించాలనుకొంది ఆ చెల్లెలు...తన భర్తతోపాటు మరో సోదరుడి కుమారుడుతో కలసి పథకం ప్రకారం సొంత అన్నను కొట్టి, కత్తితో పొడిచి చంపిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. పుంగనూరు రూరల్ సిఐ మదుసూధన్‌రెడ్డి కథనం మేరకు... మండలంలోని వెంగళపల్లి పంచాయతీ పాలెంపల్లికి చెందిన శ్రీరాములు(50) నిత్యం మద్యం మత్తులో వుంటూ తన భార్య పెద్దబోయకొండమ్మను నానా బాధలు పెట్టేవాడు. అతను కొట్టే దెబ్బలకు తట్టుకోలేక ఆమె అదే గ్రామంలో నివశించే శ్రీరాములు చెల్లెలు కావేటి శారద ఆమె భర్త కావేటి శ్రీనివాసులు, తమ్ముడైన చలపతి కుమారుడు గోవిందు విజయ్‌కుమార్‌లతో మొరపెట్టుకొంది. దీంతో వారు ముగ్గురు పెద్దబోయకొండమ్మ కష్టాలు పోవాలంటే శ్రీరాములును కడతేర్చాలనుకొన్నారు. ఈనెల 3న ముగ్గురు వ్యక్తులు శ్రీరాములు ఇంట్లోకి వెళ్ళి మూకుమ్మడిగా దాడి చేసారు. ఈ దాడిలో కూరగాయలు తరిగే కత్తితో శ్రీరాములను పొడవగా అతనికి రక్తస్రావమైంది. దీంతో ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి ఉడాయించారు. గుర్తించిన చుట్టుపక్కల వారు గాయపడ్డ అతన్ని 108సేవల ద్వారా మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి అటు నుంచి తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న శ్రీరాములు ఈనెల 5న మృతి చెందాడు. మృతుని భార్య పెద్దబోయకొండమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారు. దర్యాప్తులో భాగంగా సోమవారం నిందితులు పాలెంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వున్నారన్న సమాచారం మేరకు అరెస్టు చేసి పుంగనూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారిని రిమాండ్‌కు ఆదేశించినట్లు సిఐ వివరించారు. ఎస్‌ఐ రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 17న 'ఆణివారఆస్థానం'
## -సాయంత్రం పుష్పపల్లకి,ఆర్జితసేవలు రద్దు



తిరుమల,జులై 10ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామికి పూర్వం వార్షిక లెక్కలు నివేదించే "సాలకట్ల ఆణివార ఆస్థానం' 'ఆనవాయితీగా ఆషాడమాసం దక్షిణాయనం పుణ్యకాలంలో టిటిడిఅధికారులు చేపడతారు. 17వతేదీ సోమవారం గోవిందుని ఆలయంలో బంగారువాకిలిలో ఆస్థానం జరిపిస్తారు. ఆణివార ఆస్థానంకు తిరుమల ఆలయంలో ఎంతో ప్రాశస్త్యం ఉంది. మొదటి గంటి తరువాత విశ్వక్సేనులవారిని, ఉత్సవమూర్తులను బంగారువాకిలిలో కొలువుదీర్చుతారు. అక్కడ జీయర్లు, ఆలయ అర్చకులు, వేదపండితులు, టిటిడి అధికారులు స్వామివారికి వేదోక్తంగా ఆస్థానం నిర్వహిస్తారు. ఆనందనిలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు,ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలు ధరింపజేస్తారు. అనంతరం బియ్యం భిక్షగా స్వీకరించి స్వామివారికి నివేదిస్తారు. జీయరుస్వాములకు, టిటిడి ఇఒకు లచ్చన అనే తాళపు గుత్తిని తగిలిస్తారు. రూపాయి దక్షిణ స్వీకరణతో ఆణివార ఆస్థానం ముగుస్తుంది. ఈ పర్వదినం సందర్భంగా ఆరోజు సాయంత్రం శ్రీదేవిభూదేవిసమేతుడై మలయప్పస్వామి సుగందసువాసనలు వెదజల్లే పుష్పాలతో రూపొందించిన పుష్పపల్లకినెక్కి ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు.ఆలయంలో జరిగే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవలు రద్దుచేశారు.

# స్పందన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి



జేసి డికె బాలాజీ

తిరుపతి కలెక్టరేట్, జులై 10, ప్రభాతవార్త

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాలవ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలని జేసి డికె బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోనిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసి స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు ఇంచార్జి డిఆర్ఓ కోదండరామిరెడ్డి, ఎస్‌డిసిలు భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 160 వినతులు రావడం జరిగిందని జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిందిగా స్పందనకు హాజరైయిన వివిధ శాఖలకు సంబంధించి జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# ఆలయంలో మృత్యుంజయ అభిషేకాలు
## భక్తులతో కళ కళ



శ్రీకాళహస్తి, జూలై 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. ఆలయంలో సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు కాబట్టి దూర ప్రాంతాలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.దాంతో శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు. కాగా ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం,మృత్యుంజయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది.

**మృత్యుంజయునికిషోడషాభిషేకాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారంప్రత్యేకాభిషేకాలు,అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు.ఇక్కడి మృత్యుంజయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతాలు తల్లడిల్లుతున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు.ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడషాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అబిషేకాలు నిర్వహించారు.ఈ అభిషేకాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు,గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయమానంగా అలంకరించి ధూప,దీపనైవేద్యాలను మహా మంగళ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు నిరంజన స్వామి సారధ్యంలో షోడషాభిషేకాలు నిర్వహించారు.ఈకార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.కాగా ఏర్పాట్లను ఎఇఓ సతీష్‌మాలిక్,లోకేష్‌రెడ్డి, హరియాదవ్, సుదర్శనం,నాగభూషణం పర్యవేక్షించారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధి
## డిప్యూటీ సిఎం నారాయణస్వామి
## వెదురుకుప్పం పంచాయితీలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



వెదురుకుప్పం, జూలై 10 ప్రభాతవార్త :

అర్హతకలిగిన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ ఫలాల ప్రయోజనం చేకుర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రం లోని సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వెదురుకుప్పం పంచాయితీలో మూడు కోట్ల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఎంపిడివో కార్యాలయం వెనుక భాగంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెదురుకుప్పం పంచాయితీలో 50 లక్షలతో జగనన్న షాపింగ్ కాంప్లెక్స్, సిఆర్ కండిగలో 40 లక్షలతో సిసి రోడ్డు, మూడు లక్షలతో కమ్యూనిటి సానిటరీ కాంప్లెక్స్, 25.30 లక్షలతో జలజీవన్ మిషన్ కింద రక్షిత మంచినీటి పథం, 21.80 లక్షలతో రైతు బరోసా కేంద్రం,కానాల వారిఇండ్ల వద్ద నాలుగు లక్షలతో సిసి, రోడులను, కోటి రూపాయలతో నిర్మించిన డ్రైనేజ్ కాలువలను ప్రారంభించడం జరిగిందన్నారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు రెడ్డెప్ప, జడ్పీ ఛైర్మెన్ శ్రీనివాసులు, ఏపిఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు విజయానంద రెడ్డి, సర్పంచ్ శిల్పాశంకర్, ఎంపిటీసీ పుత్తూరు రాధిక పురం ధర్ రెడ్డి, ఎంపిపీ నాగరాణి, జడ్పీటిసి సుకుమార్, మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి,జడ్పీ సీఇవో ప్రభాకర్ రెడ్డి,తహాశీల్దార్ లక్ష్మీ నారాయణ, ఎంపిడివో సుధాకర్‌రావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ రెడ్డి,మాజీ పుత్తూరు మార్కెటింగ్ కమిటీ ఉపాధ్యక్షులు మరకాలకుప్పం రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్య, మౌళిక వసతులు కల్పించాలి
## మంత్రి నాగార్జున



తరగతి గదులను తనిఖీ చేస్తున్న మంత్రి నాగార్జున

చిల్లకూరు, జులై 10, ప్రభాతవార్త

చిల్లకూరు గ్రామంలో ఏర్పాటైన బాలయోగి గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌళిక వసతులు కల్పించాలని సోసియల్‌వెల్ఫేర్ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సోమవారం బాలయోగి గురుకుల పాఠశాలలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. తరగతి గదులతో పాటు వంటశాల, విద్యార్థుల విశ్రాంతి గదులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు పెద్దపీట వేసి నాడు నేడు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలను ఎంతో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు లేవని వెంటనే మరమత్తులు చేపట్టాలని వారు తెలిపారు. అదే విధంగా వంటశాలలో పని చేస్తున్న కార్మికులకు శానిటషన్ సిబ్బందికి నాలుగు నెలల నుంచి జీతాలు లేవని వారి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో కాంట్రాక్టు బేస్ కింద పని చేస్తున్న అటెండర్ సురేష్ అనే వ్యక్తి మద్యం సేవించి వీడియోలు తీసిన సన్నివేశాలు గమనించిన మంత్రి పిలిచి విచారించిన అతను మద్యం మత్తులో పొంతన లేని సమాధానం చెప్పడంతో వెంటనే విధులనుంచి ఆ వ్యక్తిని సస్పెండ్ చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ మీరాసాహెబ్‌కు తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్ సిఐ దశరథరామారావు, ఎస్‌ఐ వి.గోపాల్‌తో పాటు గురుకుల పాఠశాల సిబ్బంది ఉన్నారు.

# భజనమండళ్ళ శోభాయాత్ర



తిరుపతి,జులై 10ప్రభాతవార్త:

ధార్మికసంస్థ టిటిడి ఆధ్వర్యంలో మూడురోజులు త్రైమాసిక మెట్లోత్సవంలో భాగంగా సోమవారం సాయంత్రం 4గంటలకు గోవిందరాజస్వామి ఆలయం నుండి మూడోసత్రం ప్రాంగణం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్నాటకరాష్ట్రాల నుంచి తరలివచ్చిన భజనమండళ్ళ కళాకారులతో ఈ యాత్రతో తిరుపతి నగరం మరింతగా గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



# కుటుంబాలను కోల్పోయాం...
## -విజయవాడ వాసుల ఆవేదన -ఓదార్చిన అధికారులు





మృతుని బంధువులు, పోలీసులతో మాట్లాడుతున్న ఆర్డీవో, ఎఎస్‌పి

-మృతదేహాల దృశ్యం

తొట్టంబేడు, జూలై 10 ప్రభాతవార్త

ఆదివారం మద్యాహ్నం పట్టణానికి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద జరిగిన లారీ, కారు ప్రమాదంలో ఆరుమంది విజయవాడ వాసులు మృత్యువాడ పడిన సంగతి తెలిసిందే. వీరిలో ఒకరు స్వల్పగాయాలతో బయటపడగా అతన్ని స్థానిక ఎంజిఎం ఆస్పత్రిలో చికిత్స అందించారు. గాయాలతో బయటపడిన భరత్‌కు కాలుఫ్యాక్చర్ అయ్యింది. మృతిచెందిన వారిలో విజయవాడ కృష్ణలంకలోని బాలాజీటవర్స్‌లో ఉంటున్న తుంగలరమేష్(48) ఫైనాన్స్ వ్యాపారం చేసుకుని జీవిస్తున్నారు. ఆయన సతీమణి రాజ్యలక్ష్మి గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు రేవంత్ చెన్నైలో డిగ్రీ చదువుతుండగా, చిన్నకుమారుడు భరత్(17) ఇంటర్ చదువుతున్నారు. గుడివాడకు చెందిన పడమటి వెంకటనరసింహమూర్తి చిట్స్‌తో పాటు బ్యాటరీ పనులు చేసుకునేవాడు. ఆయన భార్య వెంకటరమణి, కుమార్తె అక్షయలు కారులో విజయవాడ నుంచి తిరుమలేశుని దర్శనానికి బయలుదేరారు. శనివారం తిరుమలేశుని దర్శించుకుని ఆదివారం ఉదయం కారులో విజయవాడకు బయలుదేరారు. ఈనేపథ్యంలో కారు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుమంది అక్కడికక్కడే మృతిచెందగా, కారులో ప్రయాణిస్తున్న రమేష్‌బాబు చిన్నకుమారుడు భరత్(17) తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో మిట్టకండ్రిగ వద్ద భయానకవాతావరణం చోటుచేసుకుంది. మృతదేహాలను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో మార్చురీకి తరలించారు. అయితే ఇక్కడ రెండు మృతదేహాలను మాత్రమే ఉంచే వీలుంది. దీంతో మరో నలుగురి మృతదేహాలను ఫ్రీజర్ తెప్పించి అందులో ఉంచారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి పరిస్థితిని పరిశీలించడంతో పాటు ఆస్పత్రికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్డీవో రామారావు ఉదయం నుంచి ఆస్పత్రి వద్దనే ఉండి మృతుల కుటుంబసభ్యులకు సహాయసహకారాలు అందించారు. మృతదేహాలకు పోస్టుమార్టంను తిరుపతి డిసిహెచ్ఎస్ డాక్టర్ కె.మణి ఆధ్వర్యంలో సూపరిండెంటెండ్ ఆదేశాలతో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ హరిత, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ దివ్యయాదవ్‌లు నిర్వహించారు. విశ్రాంతి లేకుండా వాహనం నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని ఎస్‌పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా మృతులకుటుంబసభ్యుడు జయరాం మాట్లాడుతూ తాను తమిళనాడు హోసూరులో ఉంటానని తమ కుటుంబాన్ని మొత్తం కోల్పోయామని ఇలాంటి దుస్థితి ఎవ్వరికీ రాకూడదని కన్నీటి పర్యంటమయ్యాడు. శ్రీలత కుటుంబసభ్యులు కూడా మాట్లాడుతూ అక్క, బావ తిరుమలేశుని దర్శనానికి వెళ్తామని చెప్పి మృత్యువాతపడడం శోచనీయం అని ఏం మాట్లాడాలో తెలియడం లేదని కన్నీరుపెట్టుకున్నారు. పోస్టుమార్టం అయ్యేవరకు ఎఎస్‌పి కులశేఖర్, ఆర్డీవో రామారావు, తహాశీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్, ఆర్‌ఐ దివాకర్, ఇన్‌ఛార్జి డిఎస్‌పి భవ్యకిషోర్, సిఐలు అంజూయాదవ్, విక్రమ్, అజయ్, ఎస్‌ఐలు రాఘవేంద్రలు ఉన్నారు. మృతుల వద్ద ఉన్న బంగారునగలు, బ్యాగులను, వారి ఆధార్‌కార్డులను తొట్టంబేడు ఎస్‌ఐ రాఘవేంద్ర సారథ్యంలో ఎఎస్‌ఐ మణిలు బాదిత కుటుంబసభ్యులకు అందించారు.

# మల్లానూరును స్మశానంగా మార్చుతారా.. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

## అధికార పార్టీ ఆగడాలకు అంతులేదా.. వైకాపా కన్వీనర్‌పై చర్యలు తీసుకోండి.. పోలీసులకు ఫిర్యాదు

కుప్పంరూరల్, జూలై 10 ప్రభాతవార్త
ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న మల్లానూరు పట్టణాన్ని వైకాపా నేతలు స్మశానంగా మార్చాలని చూస్తున్నారని వారి ఆగడాలను ప్రశ్నిస్తే దాడులు చేయడం సమంజసం కాదని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపిపి సాంబశివం పేర్కొన్నారు. సోమవారం మల్లానూరులో వైకాపా నేతల తీరుకు నిరసనగా దేశం నేతలు ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మల్లానూరులో చెరువును ఎందుకు పూడ్చుతున్నారని ప్రశ్నించిన వారిపై మండల కన్వీనర్ మురుగేష్ అతని తనయుడు శ్రీను, వైకాపా నేతలు విచక్షణారహితంగా దాడులు చేశారన్నారు. ఇలాంటి



సంఘటనలకు మరలా పాల్పడితే సహించేది లేదన్నారు. దళితులపై దాడి చేసిన వైకాపా నేతలపై హత్యాయత్నం సెక్షన్ 307కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి నేతలపై అక్రమంగా రౌడీషీట్లు తెరిచే పోలీసులు వైకాపా గూండాలపై సైతం చార్జ్‌షీట్లు తెరవాలన్నారు. అనంతరం అర్బన్ సిఐ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమాల్లో నేతలు రామచంద్ర, జిఎం రాజు, మహేంద్ర, ధనశేఖర్, సంతోష్, గోపి, పార్థసారథి, సుబ్బు, రమేష్, రాధాకృష్ణమూర్తి, సంజీవి, బాలకృష్ణ, లీలా వెంకటేష్, మోహన్, సుధాకర్, షరీఫ్, విభూషణ్, రమేష్, అశోక్, ప్రకాష్, అన్నాదొరై, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధిస్తాం

### - తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం




కుప్పం, జూలై 10 ప్రభాతవార్త
రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పంలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు లక్ష మెజార్టీ సాధిస్తామని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం కుప్పం నియోజకవర్గ తెలుగు మహిళ విభాగం నేతలు మహాశక్తి పథకం ప్రచారానికై కాణిపాకం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈసందర్భంగా మహిళా నేతలు మాట్లాడుతూ మహాశక్తి పథకం కింద మహిళలకు ప్రతినెలా 1500రూ.లు, అమ్మకు వందనం పేరిట ప్రతి పిల్లాడికి రూ 15000ల వంతున అందిస్తామని చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. అలాగే ఏటా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని ప్రకటించడం పట్ల మహిళల పక్షపాతిగా చంద్రబాబు మారారన్నారు. మహాశక్తి పథకం గురించి విస్తృత ప్రచారం చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర నేత కాణిపాకం వెంకటేష్, ప్రకాష్, తెలుగుమహిళలు వసంతమ్మ, పద్మమ్మ, జయమ్మ, తిరుమగళ్ తదిరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ సేవలకు అపూర్వ స్పందన

తవణంపల్లె, జూలై 10 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ సేవలకు అపూర్వ స్పందన లభిస్తోంది. సోమవారం మండలంలోని గోవిందరెడ్డిపల్లె గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు, పల్లెచెరువు గ్రామంలో డాక్టర్ ప్రియాంకల ఆధ్వర్యంలో ప్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా 104 వాహనం ద్వారా రోగులకు వైద్యసేవలందించారు. ఈసందర్భంగా బిపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సంభందించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అలాగే గర్భవతులకు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. దీనితో పాటు పరిసరాల పరిశుభ్రత, అంటువ్యాధుల నివారణ స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్‌లు సుబ్రమణ్యంరెడ్డి, నేత్రి, కళావతి,జమున, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజల సమస్యలకు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత

తిరుపతి క్రైం, జులై 10, ప్రభాతవార్త
స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజల సమస్యలకు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని అడిషనల్ ఎస్‌పిలు అడ్మిన్ వెంకటరావు, క్రైమ్ విమలకుమారిలు పేర్కొన్నారు. సోమవారం ఎస్పి కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 65 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పి



పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పిలు అడ్మిన్ వెంకటరావు, క్రైమ్ విమలకుమారి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులందరితో ఎస్పి మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబం కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు చేశారు. స్పందన ఫిర్యాదులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, ఫిర్యాదులను చట్టప్రకారం విచారణ జరిపించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### - ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్



రామకుప్పం, జూలై 10 ప్రభాతవార్త
పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చితూ రు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. సోమవారం ముద్దనపల్లిలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగిస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఓ పథకంలో లబ్ది కలుగుతోందన్నారు. 2024లో మరలా సిఎంగా జగనన్న ఎన్నికవుతారన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపించి ఆదరించాలని ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబురెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చెరువుల బాధ్యతలు మీదే.. కావు మీవే !!

### - రెవెన్యూ.. ఇరిగేషన్ అధికారుల మధ్య వాగ్వివాదం

కుప్పంరూరల్, జూలై 10 ప్రభాతవార్త
మండలంలోని మల్లానూరులో వివాదాస్పదంగా మారిన చెరువు వ్యవహారంపై చెరువుల నిర్వహణ, పరిరక్షణ బాధ్యతలు మీవంటే మీవంటూ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మండలంలోని మల్లానూరు చెరువును వైకాపా నేతలు ఆక్రమించేందుకు మట్టిని



తరలించారనే విషయంగా దాడులు జరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం తహాశీల్దార్ పార్వతి, ఇరిగేషన్ డిఇ హరినాథ్‌రెడ్డి చెరువు వద్దకు చేరుకుని పరిశీలించారు. చెరువులకు రెవెన్యూకు సంబంధం లేదని తహాశీల్దార్ పేర్కొన్నారు. అయితే ఇరిగేషన్ డిఇ హరినాథ్‌రెడ్డి 2021లోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చెరువుల పరిరక్షణ బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ విభాగాలకు కేటాయించిందన్నారు. ఈమేరకు అప్పట్లోనే తాను సంబంధిత ప్రభుత్వ జిఓ కాపీలను పంపించినట్లు పేర్కొన్నారు. అనంతరం చెరువును పరిశీలించారు. చెరువులో అక్రమంగా తరలించిన మట్టిని పక్కకు తీసేసి ప్రభుత్వ భూమి బోర్డు ఏర్పాటుచేయాలని కార్యదర్శి రమ్యలక్ష్మిని అధికారులు ఆదేశించారు.

## కుప్పంలో తెదేపా.. ఎంఆర్‌పిఎస్.. జనసేన శ్రేణుల ధర్నా



కుప్పం, జూలై 10 ప్రభాతవార్త
కుప్పం పట్టణంలో సోమవారం తెలుగుదేశం పార్టీ నేతలు, ఎంఆర్‌పిఎస్, జనసేన శ్రేణులు ధర్నా చేపట్టారు. స్థానిక బస్టాండులో రోడ్డుపై బైఠాయించారు. మల్లానూరుకు చెందిన ఎంఆర్‌పిఎస్ నేతలు ప్రకాష్, రాజేష్‌లపై దాడి చేసిన మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్‌ను వెంటనే అరెస్ట్ చేసి అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మండల కన్వీనర్ వీధి రౌడీగా మారారని విమర్శించారు. అక్రమంగా చెరువు కబ్జాకు యత్నిస్తున్నారని ప్రశ్నించిన వారిపై దాడి చేయడం దారుణమని అధికార పార్టీ అండ చూసుకుని రెచ్చిపోవడం తగదన్నారు. ఇలాగే జరిగితే మాదిగ గ్రామాల్లో తిరగలేడని హెచ్చరించారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రా ష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపిపిలు సాంబశివం, డా॥ వెంకటేష్, నేతలు సత్యేంద్రశేఖర్, రామచంద్ర, కన్నన్, మంజు, రవి,సంతోష్, కౌన్సిలర్ సోమశేఖర్, నబీఉల్లా, బాలు, బాలాజీ, విభూషణ్, ప్రకాష్, సుబ్బు, నరేష్,ఎంఆర్‌పిఎస్ నేతలు దేవరాజ్, ప్రకాష్, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎంకామ్ ఫలితాల్లో ఐఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

కుప్పం, జూలై 10 ప్రభాతవార్త
ఎంకామ్ ఫస్టియర్ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఐఆర్ఎం కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. ధరణి 439మార్కులు, సాదియా తబస్సుమ్ 428, ఫైజా 426మార్కులు, జయంత్ 423, కవిత 424, ఊహ416, శివపుత్ర 386, ఫర్హాన్ 382మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ అభినందించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పనిచేయని సర్వర్లు - అవస్థల్లో ప్రజలు

కోట, జూలై 10 ప్రభాతవార్త
ప్రజాపంపిణీ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చామని ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. నిత్యావసర వస్తువులు తీసుకునేందుకు రేషన్ కార్డుదారులకు అవస్థలు తప్పడంలేదు. రెండుసార్లు వేలిముద్రలు వేయాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ పనిచేయక నిరీక్షించాల్సి వస్తుంది. సరుకులు సకాలంలో అందక ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుతం చౌక బియ్యం, ఇతర సరుకుల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షల 35వేల కార్డులు ఉన్నాయి. మొబైల్ వాహనాల ద్వారా 17వ తేదీ వరకు సరుకులు అందించాల్సి ఉంది. ఇప్పటివరకు 25 శాతం కార్డుదారులకు కూడా పంపిణీ జరగలేదు. సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ఒక్కొక్క వినియోగదారుడికి 20 నిమిషాల నుంచి అర్ధ గంట పడుతుందని ఎండియు ఆపరేటర్లు చెప్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే అందించలేమని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు ఇప్పటివరకు ఒక వేలిముద్ర వేస్తే సరిపోయేది. అయితే ఈ నెల నుంచి రెండుసార్లు తప్పనిసరి అని అధికారులు పేర్కొన్నారు. దీంతో కార్డుదారులతో పాటు ఎండియు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయం కోసం ఉన్నతాధికారుల దృష్టికి ఎండియు వాహనదారులు తీసుకెళ్తున్నారు.

## ఎండియు ఆపరేటర్ల సమస్యలను పరిష్కరిస్తాం

కోట, జులై 10, ప్రభాతవార్త
చిత్తూరు జిల్లాలోని ఎండియు ఆపరేటర్ల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తిరుపతి జిల్లా డిఎస్ఓ రాజా రఘువీర చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డిఎస్ఓను ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షుడు ఏడుకొండలు ఆధ్వర్యంలో డిఎస్ఓ రాజా రఘువీరను కలిసి వినతి పత్రం అందజేసారు. రేషన్‌కార్డు దారులకు రెండు సార్లు వేలిముద్ర వేయాల్సి రావడంతో సక్రమంగా సర్వర్ పని చేయక ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. అంతే కాకుండా వినియోగదారులు తమకు నోటికివచ్చినట్లు తిడుతున్నారని చెప్పారు. సర్వర్లు వేగవంతంగా పని చేసే విధంగా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. తమకు రావాల్సిన బకాయిలపై కూడా ఆయనకు వివరించారు. గత ఏడు నెలలుగా ఐసిడిఎస్, ఎండిఎం స్కూల్‌లకు సంబంధించి రవాణా చార్జీలు చెల్లించలేదన్నారు. డిఎస్ఓ రాజారఘువీర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని రాజారఘువీర తెలిపినట్లు ఏడుకొండలు తెలిపారు.

## నూతన తహశీల్దార్‌ను కలిసిన వైసిపి సీనియర్ నాయకులు గెడి వేణురెడ్డి

ఓజిలి, జులై 10, ప్రభాతవార్త
ఓజిలి మండలం నూతన తహశీల్దార్ శివరామ సుబ్బయ్యను కురగొండ గ్రామానికి చెందిన వైసిపి పార్టీ సీనియర్ నేత గెడి వేణురెడ్డి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి మిఠాయిలు అందజేసారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శివరామ సుబ్బయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌ను కోరారు.



అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ప్రియాంకను మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్లు అందజేసారు. ప్రజలకు మరిన్ని సేవలు చేసి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

## జెసిని కలిసిన ఎండియు ఆపరేటర్లు

కోట, జులై 10 ప్రభాతవార్త
కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎండియు ఆపరేటర్లు సోమవారం తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. ఆ మేరకు జెసికి వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు ఇప్పటివరకు ఒక వేలిముద్ర వేస్తే సరిపోయేదని, ఈ నెల నుంచి రెండుసార్లు తప్పనిసరి అని అధికారులు చెప్పడంతో వినియోగదారులతో వివాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. దాంతో పాటు సర్వర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదని, దీంతో గంటలకొద్దీ ఆలస్యమవుతోందని వివరించారు. తమ సమస్యలను పరిష్కరించాలని వారు వినతిపత్రం అందజేశారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఆర్డివోను కోరిన సిపిఐ నాయకులు



గూడూరు, జులై 10, ప్రభాతవార్త
భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డిఓ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ 2018 నుండి అపరిష్కృతంగా ఉన్న క్లెయిమ్స్ రిలీజ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. జిఓ. నెం. 17తో దారి మళ్లిన డబ్బును బోర్డుకు జమచేయాలన్నారు. ఇసుకను పాత పద్ధతిలోనే కొనసాగించి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జీ.శశి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షలను పైగా భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదు కాబడి ఉన్నారన్నారు. వీరందరు గత నాలుగేళ్లకు పైగా ఇసుక కొరతతో పనులు లేక ఉపాధి కోల్పోయి కుటుంబాలు పూట గడవక దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం 2018 నుండి ఏ ఒక్క క్లైయిమ్ కూడా రిలీజ్ చేయకుండా 2018 నుండి అనేక దపాలుగా అధికారులకు మా సమస్యలు తెలియజేస్తున్నా ఏ మాత్రం పటించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు గమనించి చితికిపోయిన బ్రతుకులను కాపాడటానికి పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకునే దశగా కృషి చేయాలని కోరారు. జిఓ నెం. 17తో దారి మళ్ళిన డబ్బును సంక్షేమ బోర్డుకు జమ చేయాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా మాట్లాడుతూ 2018 నుండి పెండింగ్‌లో వున్న క్లైయిమ్స్ రిలీజ్ చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. సుప్రీమ్ కోర్టు తీర్పు ప్రకారంగా సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలన్నారు. ఇతర పథకాలకు మళ్లించరాదన్నారు. పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న భవన నిర్మాణ కార్మికులకు 2 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. పనిముట్లు లేబర్ ఆఫీసులో తుప్పు పట్టిపోవుచున్నాయని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు అందించాలని బిల్డర్స్, ఇన్సూరెన్సు గ్రూపు వర్కర్స్ కూడా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి నాయకులు ఎంబేటి చంద్రయ్య, చైతన్య, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## తడ మండలం అక్కంపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఘనస్వాగతం




తడ, జులై 10 ప్రభాతవార్త
తడ మండలం గ్రద్దగుంట పంచాయతీ అక్కంపేట సచివాలయం పరిధిలో సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన డిసిఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డితో పాటు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకి మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఇచ్చిన మాట మీద నిలబడే నాయకుడు సీఎం జగనన్న అంటూ సంజీవయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారికి బుక్‌లెట్లు అందిస్తూ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని ప్రతి గడపలో సమస్యలు ఇంకేమైనా ఉన్నాయా అంటూ ప్రశ్నిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల వైఎస్ జయంతి వంటివి రెండు గ్రూపులుగా జరుపుకున్న వైసీపీ నాయకులు కూడా కొంతమంది సోమవారం ఒకే చోట కనిపించడం విశేషం. సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, తడ ఎంపిపి కొళవి రఘు, వైస్ ఎంపిపి కుప్పంపాటి వెంకటేష్, గ్రద్దగుంట సర్పంచ్ కె.కాటయ్యలతో పాటు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలి



వాకాడు, జులై 10, ప్రభాతవార్త
టిడిపి నాయకుల అసత్య ఆరోపణలపై వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. సోమవారం వాకాడు ఏఎంసీ కార్యాలయం ఆవరణంలో వైకాపా మండల కమిటీ ఆధ్వర్యంలో దామోదర్ రెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ వాకాడులో జరిగిన పాదయాత్రలో లోకేష్ మాట్లాడిన స్వర్ణముఖి బ్యారేజీ ఎత్తు, మూడు టీఎంసీ నీరు విడుదల, వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని ఈ మూడు విషయాలపై అవగాహన లేకుండా మాట్లాడాడని, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ మీదే ఆధారపడి మాట్లాడిన విషయంపై తాను విమర్శ చేయడం జరిగిందని తెలిపారు. సంక్షేమం అభివృద్ధిలో అవినీతి చేశామని టిడిపి నాయకులు చెప్పడం దేవుని వద్ద ప్రమాణానికి నేను సిద్ధమే మీరు సిద్ధమా ఇకనైనా అసత్యపు మాటలు మానుకోవాలని, తాను దిగజారు రాజకీయాలు ఏనాడు చేయలేదని టిడిపి మండిపడ్డారు. ఏపీలో ఏ ప్రభుత్వం వచ్చినా వాకాడు మండలాన్ని అభివృద్ధి చేసింది మేమేనని టిడిపి నాయకులకి తెలిపారు. వాకాడు మండలం ఏ పార్టీ అధికారంలో ఉన్న గెలిచేది మా ఎంపిటిసిలే జడ్పిటిసిలే సర్పంచులే అని తెలుసుకోవాలని సూచించారు. చిల్లర రాజకీయాలు చేసి జోబులో నింపుకునే టిడిపి నాయకులు మాట్లాడే అర్హత లేదని ఆరోపించారు. ఏ పని చేసినా ప్రజలకి తెలిసేలా చేస్తామని ఘాటుగా టిడిపి నాయకులకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకటరమణయ్య, సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూధన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకటరత్నం, నాగరాజు, మాజీ ఎంపిపి మధుసూదన్ రెడ్డి, సుధాకర్ నాయుడు, మహేంద్ర, రవి శేఖర్ రెడ్డి, శివరాం రెడ్డి, వాకాటి రవికుమార్, మాజీ సర్పంచ్ సంపత్, కుమార్ తదితరులు ఉన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ

గూడూరు, జులై 10, ప్రభాతవార్త
తిరుపతి జిల్లా గూడూరు పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవనంలో అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ హెల్పెజీ కార్యక్రమం నిర్వహించారు. 32 మంది నిరుపేద వృద్ధులకు ఫలసరుకులు, బియ్యం అందజేసారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రోటేరియన్ సి. రామకృష్ణ స్వరూప్ మాట్లాడుతూ రోటరీ ఈ సంవత్సరం నూతనంగా బాధ్యతలు స్వీకరించానని, ఈ కార్యక్రమం గత 18 సంవత్సరాలుగా నిరంతరాయంగా నిరుపేద వృద్ధులకు అల్లూరు ఆదిశేషారెడ్డి ఆశయంతో ఫల సరుకులు, బియ్యం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సీనియర్ రోటేరియన్ బి. దశరథరామి రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంను ఈ నూతన అధ్యక్షుడిగా రామకృష్ణ స్వరూప్ ఆధ్వర్యంలో జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సి. రామకృష్ణ స్వరూప్, కార్యదర్శి శ్రావణ్ కముఆర్, సీనియర్ రోటేరియన్స్ బి. దశరథరామి రెడ్డి, హరిప్రసాద్, శ్రీధర్ రెడ్డి, రవికుమార్, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

# తిరుపతి డివిజన్

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

-సుబ్బమ్మ మోహన్‌రావు పొండేషన్ వారం మెరిట్ విద్యార్థులకు పతకాలు



శ్రీకాళహస్తి, జూలై 10 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని శ్రీకాళహస్తీశ్వరాలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ బి.బాలాజీ నాయక్‌లు తెలిపారు. సోమవారం పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న సరస్వతీబాయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సుబ్బమ్మ మోహన్‌రావు పౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుతులను అందించే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి అధ్యక్షురాలిగా ప్రధానోపాధ్యా యురాలు బృందాదేవ అధ్యక్షత వహించి అతిధులను వేదికపైకి ఆహ్వానించారు. ఈసందర్భంగా సుబ్బమ్మ, మోహన్‌రావు పౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 12 ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 66మంది విద్యార్థులకు బంగారుపతకాలు మరియు మెమొంటోలను అందించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుబ్బమ్మ మోహన్‌రావు పౌండేషన్ తరపున ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదువతున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం ఎంతో అభినందనీయం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, పౌష్టికాహారంతో కూడి భోజనం అందిస్తున్నారని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని కోరారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే విజయం సాధ్యమవుతుందని నేటి కంప్యూటర్ ప్రపంచంలో పోటీతత్వాన్ని అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ బి.బాలాజీనాయక్, పట్టణ ప్రముఖులు పివిఆర్ గ్రూపు సంస్థల అధినేత ప్రతాప్ రావు, జనార్ధన్‌రావు జె.పవార్, ముకుందరావు, జె.పవార్, గుమ్మడి బాలకృష్ణయ్య, సుబ్రమణ్యం, వైకాపా నాయకుడు కొండూరునంద, మాజీ కౌన్సిలర్ మహబూబ్‌బాషా, పూలకృష్ణమూర్తి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, బాలిశెట్టినరసింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ కమిషనర్‌కు సన్మానం



శ్రీకాళహస్తి,జూలై 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపాలిటిని ప్రగతి పథకంలో నడిపిన రిటైర్డ్ కమిషనర్ బి.అజయ్‌కిషోర్ శ్రీకాళహస్తికి వచ్చిన సందర్భంగా ఆయనకు వైకాపా యువ నాయకుడు పఠాన్ ఫరీద్‌ఖాన్ సత్కరించారు.శ్రీకాళహస్తి మున్సిపాలిటి అభివృద్ధిలో అజయ్‌కిషోర్ కీలకంగా వ్యవహారించారు. ముఖ్యంగా ఆసుపత్రి రోడ్డు నుంచి ఎస్‌డికె నగర్ వైపు సిమెంటురోడ్డు నిర్మాణం లోనూ, అలాగే ఎస్‌డికె నగర్ అభివృద్ధికి, ఇక్కడ ప్రధాన రోడ్డును సిమెంటురోడ్డుగా ఏర్పాటు చేయటానికి అజయ్‌కిషోర్ విశేష కృషి చేసారు.అలాగే మున్సిపాలిటిలో అభివృద్ధిలోనూ సిబ్బంది సమస్యలు పరిష్కారంలోనూ, రాజీవ్‌నగర్‌లో సదుపాయాల కల్పనలో అజయ్‌కిషోర్ విశేష కృషి చేసారు. శ్రీకాళహస్తికి వచ్చిన అజయ్‌కిషోర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.బాలాజి నాయక్‌ను కలసినారు. పుణ్యక్షేత్రంలో పని చేయటం అదృష్టమన్నారు. తాను రెండు సార్లు ఇక్కడ పని చేసానని అజయ్‌కిషోర్ వివరించారు.ఈ సన్మాన కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు పఠాన్ ఫరీద్‌ఖాన్, ఆర్‌ఓ నారాయణరెడ్డి, ఆర్‌ఐ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన



నగరి, జూలై 10 ప్రభాతవార్త: వలంటీర్లు హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించడంపై వలంటీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్‌కార్యాలయం వద్ద వారు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లలో 70 శాతం మంది మహిళలే ఉన్నారన్న విషయం కూడా పవన్‌కల్యాణ్‌కు తెలియకపోవడం శోచనీయమన్నారు. తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు పవన్‌కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని లేకుంటే పర్యవసానం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.

## చోరీ కేసులో ముద్దాయిలు అరెస్టు

నగరి, జూలై 10 ప్రభాతవార్త: పట్టణంలోని బాలాజీ గోల్డెన్ సిటీలో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జ్ఞానప్రకాష్ అనే పాల వ్యాపారి తన భార్యతో కలసి బస్టాండ్ వద్ద తన పాల దుకాణానికి వెళ్లాడు. అదే సమయంలో సినీ ఫక్కీలో ఇంటికి ప్రహరీ గోడవైపుగా ఉన్న కిటికీని తొలగించి చొరబడ్డ దొంగలు ఇంటిలోని బీరువాను పగులగొట్టి డబ్బులు, బంగారం చోరీ చేసుకుని వెళ్లారు. దీనిపై జ్ఞానప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ చోరీ సంఘటనలో దొరికిన ఆధారాలతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సోమవారం చోరీకి పాల్పడిన తమిళనాడు తిరువళ్లూరు జిల్లా వేలప్పన్ చావడికి చెందిన దొరై(20), ఎగ్మోర్, పుదుపేటకు చెందిన కుమార్ గోపాల్(22), తిరువేలాంగణికి చెందిన రావి అజిత్ మోసిస్(22)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2.18 లక్షల నగదును స్వాధీనం చేసుకుని ముద్దాయిలను కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

## 17వ తేదీ అమావాస్య కూటం

పుత్తూరురూరల్, జూలై 10 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ నెల 17వ తేదీ అమావాస్య కూటం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ బి.ఎస్.మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లపై చర్చించనున్నారు. ఈ సమావేశానికి గ్రామ పట్టణ పెద్దలు పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

## జనసేన అధినేత వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి



పుత్తూరురూరల్, జూలై 10 ప్రభాతవార్త: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో సోమవారం రాత్రి పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు సేవా దృక్పథంతో పని చేస్తుంటే వారిపై అనుచిత వాఖ్యలు చేయడం తగదన్నారు. వలంటీర్లు వృద్ధులకు, వితంతవులకు, వికలాంగులకు ఇంటి వద్ద వెళ్లి పెన్షన్లు అందిస్తున్నారన్నారు. అలాంటి వారి పట్ల ఆయన మాటల చాలా బాధాకరమన్నారు. ఈ సందర్భంగా పురవీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జయప్రకాష్, ఎంఎల్‌వో దిలీప్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 17, 12,14 జీవోలను రద్దు చేయాలి

ధర్నా అనంతరం ఏఓకి వినతి పత్రం సమర్పణ



ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

తిరుపతి కలెక్టరేట్, జులై 10 ప్రభాతవార్త : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధి నుండి వాడుకున్న 1381 కోట్ల రూపాయిల రుణాన్ని తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి డిమాండ్ చేసారు. తిరుపతి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణలు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి నుండి వాడుకున్న డబ్బులు తిరిగి సంక్షేమ బోర్డుకు చెల్లించాలని, కార్మిక శాఖ కమిషనర్ ద్వారా విడుదల చేసిన 12,14 జీవో తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఈ జీవో ద్వారా అన్ని లేబర్ ఆఫీసులకు పంపి మనం నవరత్నాల కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలను ఇస్తున్నందు వల్ల ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు నుండి భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి సదుపాయాలు అందివ్వాల్సిన అవసరం లేదని 12, 14 జీవోని ప్రభుత్వం విడుదల చేసిందని ఈ జీవోను తక్షణం ఉపసంహరించుకోవాలని గతంలో లాగే యధావిధిగా సంక్షేమ బోర్డులో ఉన్న సదుపాయాలను కార్మికులకు కల్పించాలని తెలిపారు. నూతన ఇసుక విధానాన్ని రద్దు చేసి పాద పద్ధతిలోనే ఇసుకను సరఫరా చేయాలని, విపరీతంగా పెరుగుతున్న సిమెంటు స్టీలు ధరలు తగ్గించాలని, కేరళ తమిళనాడు ప్రభుత్వాల తరహాలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ శాఖలో సభ్యులైన భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సహాయం అందివ్వాలని వారు విజ్ఞప్తి చేసారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి తిరుపతి నగర కార్యదర్శి ఎన్‌డి రవి, చంద్రగిరి నియోజకవర్గ కార్మదర్శి చంద్రశేఖర్ రెడ్డిలు ప్రసంగించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి. శ్రీనివాసులు ఈ ధర్నా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం తిరుపతి నగర అధ్యక్ష కార్యదర్శులు రవి, హరి బాబు, ఏఐటీయుసి జిల్లా నాయకులు శివ సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథం, నాగరాణి, నరసింహులు, మునిశంకర్, ఏడుకొండలు, శ్రీనివాసులు, కనకరాజు, చిరంజీవి, ఏఐటీయూసీ నాయకులు బాబు, సురేష్, వెంకటేష్, పద్మనాభ రెడ్డి, నారాయణమ్మ, సుమిత్ర, జ్యోతి, ప్రమీల, మస్తానమ్మ, నరసింహులు, ఖాదర భాషా, ఏఐటియుసి నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# టిటిడి సమన్వయంతో రోడ్ల సేఫ్టిపై దృష్టి సారించండి: కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జులై 10 ప్రభాతవార్త : తిరుపతి నగరంలోని కొన్ని రోడ్ల సేఫ్టి కోసం, నిర్వహణ జాగ్రత్తలకు టిటిడి వారిని సమన్వయం చేసుకొని పనులు చేపట్టాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు జారీ చేసారు. గత స్పందన పిర్యాదులపై మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శ్రీనివాససేతు నుండి శ్రీనివాసం ముందర దిగే వాహనాలు, శ్రీనివాసం నుండి వచ్చే వాహనాలు వలన రద్దీ ఏర్పడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ అక్కడ ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, టిటిడి ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుని రోడ్ల నిర్వహణకు, చేపట్టాల్సిన జాగ్రత్తలపై చర్యలు తీసుకోవా లన్నారు. మ్యూజిక్ కాలేజ్, టౌన్ క్లబ్, కోర్టు వద్ద ఏర్పాటు చేస్తున్న ఫ్రీ లెఫ్టుల వద్ద గోడలపై సందేశాత్మక, ప్రజా ఉపయోగకర చిత్రాలను చిత్రకరించి త్వరగా ఉపయోగంలోకి తీసుకురా వలన్నారు. పూర్తి అయిన రోడ్లను ఈ వారంలోనే అన్నింటిని ప్రారంభించేలా తగు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. జగనన్న సురక్ష కార్యక్రమం క్యాంపుల్లో సర్టిఫికెట్స్ తీసుకుని ప్రజలకు ముందుగానే సమాచారం అందించి, వారిని క్యాంప్‌లకు హాజరయ్యేలా చూడాలన్నారు. మంచి నీళ్లగుంట అభివృద్ధికి ఇప్పటికే టిటిడి అధికారులకు తెలియ జేయడం జరిగిందని, త్వరలో వారు పనులు చేపడుతారని, అందుకు మన అధికారులు దగ్గరుండి సహకరించాలన్నారు. జగనన్నకు చెబుదాం వచ్చే స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా ఆయా సమస్యలను సకాలంలో సంబంధిత అధికారులు పరిష్కరించిన పిదప అప్‌లోడ్ చేయాలన్నారు. ప్లానింగ్ అధికా రులతో కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనధికర హోర్డింగులను తొలగించాలని, ఆక్రమిత స్థలాలపై దృష్టి సారించాలన్నారు. హెల్త్ ఆఫీసర్‌కి సూచినలు చేస్తూ ప్రజలకు ఇబ్బంది కల్గించే హోటల్స్‌పై తనిఖీలు నిర్వహించాలని, శానిటేషన్ సక్రమంగా వుండేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్ర మౌళీశ్వర్‌రెడ్డి, ఎస్‌ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, కెఎల్ వర్మ, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులురెడ్డి, బాలసుబ్రమణ్యం, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస రావు, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, రవీంద్రరెడ్డి, దేవిక, మహేష్, నరేంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.

## గోవులకు ఏకవీరసేవా ఫౌండేషన్ :పంచామృతదాణా వితరణ



తిరుపతి,జులై 10ప్రభాతవార్త:తిరుపతిలోని హథీరాంజీమఠం ఆధ్వర్యంలో గోశాలలో ఉన్న గోవులకు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి గోవులకు పంచామృత దాణా వితరణ చేశారు. మఠం గోశాలలోని గోవులకు సరైన దాణా లేదని విషయం తెలుసుకుని సోమవారం ఉదయం 40వేల రూపాయలు విలువైన ఈ దాణాను స్వయంగా తీసుకువచ్చి అందిం చారు. హథీరాంజీమఠం ఫిట్‌పర్సన్ అధికారి విజయసారథికి అందజేశారు. ఈ సందర్భంగా ఏకవీరా సేవా ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సర్వకోటిదేవతలకు గోవు నిలయమని అటువంటి గో సంపదను పరిరక్షించుకోవడం సనాతన హిందూ ధర్మంలో మనందరిదీ అన్నారు. ఈ కార్యక్రమంలో మఠం సూపరింటెండెంట్ సీతారామ్, సీనియర్ అసిస్టెంట్ గోవర్ధన్‌రెడ్డి, ఏకవీరా సేవ ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్, గంగాధర్, బ్రహ్మ, విజయ్‌భాస్కర్, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## శిశు బృందంలో అనాధలకు దుప్పట్లు పంపిణీ



తిరుపతి,జులై 10ప్రభాతవార్త:: శ్రీకృష్ణచామండేశ్వరస్వామి జన్మదినం సందర్భంగా సోమవారం మఠం ఆధ్వర్యంలోని శిశుబృందంలో అనాధలకు, పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు తిరుపతిలోని ఏవన్ కేటరింగ్ అధినేత మస్తాన్ కుటుంబం ఈ సేవాభావంతో వితరణ చేశారు. రానున్న చలికాలాన్ని పురస్కరించుకుని నివాసగృహంలో ఉన్న 150మంది పేదలకు ఈ దుప్పట్లు అవసరాన్ని గుర్తించి అందించినట్లు మస్తాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌బాషా, అబ్దుల్‌ఖాదర్, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యలు పరిష్కరించండి

-మంత్రి మేరుగ నాగార్జుకు బిషప్స్ కౌన్సిల్ విన్నపం



తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 10 ప్రభాత వార్త: ఎన్నో ఏళ్లుగా రాష్ట్రంలోని క్రైస్తవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డా॥మేరుగ నాగార్జునకు ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ ఛైర్మన్ డా॥ యలమంచిలి ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు.సోమవారం స్థానిక ఓటేరులోని బెతస్తా ప్రార్థనా మందిరంలో ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ వార్షిక సర్వసభ్య సమావేశం డా॥వై.ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నాగార్జున విచ్చేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ క్రైస్తవ సంస్థలకు రద్దు చేసిన ఎఫ్‌సిఆర్‌ఏలు పునరుద్ధరించాలని, దళితులకు, అలాగే దళిత క్రైస్తవులకు స్మశాన స్థలాలను కేటాయించాలని,పాస్టర్లకు గౌరవ వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బిషప్స్ కౌన్సిల్ అధ్యక్షుడు బిషప్ ఏజ్జల బాలరాజు,ప్రధాన కార్యదర్శి వానాల డేవిడ్ రాజు,కోశాధికారి బిషప్ విక్టర్‌పాల్,బిషప్ నవీన్‌కుమార్,బిషప్ సిహెచ్ మోజెస్,అలాగే 26 జిల్లాల నుండి అధ్యక్ష కార్యదర్శులు,బిషప్‌లు,పాస్టర్లు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణకు రక్త పరీక్షలు దోహదం:ఎంపిడిఓ



చంద్రగిరి, జూలై 10 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణకు రక్త పరీక్షలు దోహదపడ గలవని ఎంపిడిఓ రమేష్‌బాబు అన్నారు. స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో సోమవారం ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఎంపిడిఓ రక్తపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా శరీరంలో అంతర్గతంగా వున్న జబ్బులను గుర్తించవచ్చన్నారు. ఈ వైద్య శిబిరంలో 43 రకాల ఆరోగ్య పరీక్షల ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రగిరిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుండి విశేష స్పందన లభించినట్లుతెలిపారు. ప్రజల నుండి సేకరించిన రక్త నమూనాలను పరీక్షించి, రిపోర్టులను త్వరలోనే వాలంటీర్ల ద్వారా అందజేయబడతాయన్నారు. ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్‌రెడ్డి, ఎంపిటిసి మాదవరెడ్డి, ముద్దికుప్పం రామమూర్తి, ఎంపిడిఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ రవిచంద్ర, ఈఓ మహేశ్వరయ్యలు పాల్గొన్నారు.

## 12న తలనీలాల బహిరంగవేలం

కార్వేటినగరం,జూలై 10 ప్రభాతవార్త:

కార్వేటినగరం స్కంధపుష్కరిణి సమీపంలోని కొమరగిరి గుట్టపై వెలసియున్న శ్రీవళ్లీ దేవయాని సమేత శ్రీసుబ్రమణ్యంస్వామి తలనీలాల వేలం ఈనెల 12వ తేది బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించబడునని ఆలయకార్యనిర్వాహణాధికారి ఎం.కృష్ణానాయక్ తెలిపారు. వేలంపాటలో పాల్గొన దలచిన వారు పాటకు ముందు 20,000రూపాయిలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. 2023 ఆడికృత్తిక మహోత్సవ సంధర్భంగా భక్తులు శ్రీస్వామివారికి సమర్పించు తలనీలాలను 2023 ఆగస్టు 8నుంచి 11వరకు ప్రోగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ కె.కేశవరెడ్డి, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## పుట్టిన రోజు దేవుళ్ళ మధ్య జరుపుకోవడం ఆనందం



రేణిగుంట, జూలై 10 ప్రభాతవార్త: అభం శుభం తెలియని దేవునితో సమానమైన ప్రత్యేక ప్రతిభావంతుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని వైసీపీ యువనేత జీ పాళెం పంచాయతీ కన్వీనర్ వేణు అన్నారు. వేణు జన్మదిన వేడుకలు ఆదివారం రేణిగుంట విమానాశ్రయ సమీపం లోని అక్షయ క్షేత్రంలో ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులతో పాటు గాజులమండ్యం సర్పంచ్ డా.గంగారి రమేష్ లు పాల్గొన్నారు.

## పాదిరికుప్పం హైస్కూల్ పర్యవేక్షణ



కార్వేటినగరం,జూలై 10 ప్రభాతవార్త: కార్వేటి నగరం మండలం పాదిరికుప్పం జడ్పీ హైస్కూల్‌ను ఎంఇఓ మనోజ్‌కుమార్ సోమవారం పర్యవేక్షించారు. హైస్కూల్లో రికార్డులను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని, అలాగే విద్యార్థులు, ఉపాధ్యా యులు సమయపాలన పాటించాలని తెలిపారు. బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం నాడు-నేడు పథకం కింద చేపడు తున్న పనులను ఆయన పర్యవేక్షించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పదవతరగతి పిల్లలకు విద్యాపరంగా పలు సూచనలు ఇచ్చారు. ఆయనవెంట ఉపాధ్యాయురాలు సుప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు వున్నారు.

## చందనాలంకారంలో శ్రీ కాలబైరవ స్వామి




నగరి, జూలై 10 ప్రభాతవార్త: నగరి మున్సిపాలిటీ నగరి పట్టణం ఈశ్వరాలయంలో వెలసి ఉన్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో విశేష పూజలు వైభవంగా జరిగాయి. అష్టమి పూజలందుకుని స్వామివారికి పాలు,పెరుగు, పంచామృతం మొదలగు వాటితో విశేషంగా అభిషేకాలు జరిగాయి. అభిషేకాల అనంతరం స్వామివారికి, చందనాలంకారం అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. పాల్గొన్న భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు అభిషేకం చేసినటువంటి విభూది ప్రసాదాలు భక్తులకు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## నగరి మున్సిపాలిటీలో జగనన్న సురక్ష కార్యక్రమం



నగరి, జూలై 10 ప్రభాతవార్త: జగనన్న సురక్ష కార్యక్రమంలో పల్లె, పట్టణాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని మంత్రి రోజా రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరి మున్సిపాలిటీ నత్తం కండ్రిగ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డుల్లో మార్పులు వంటివి చాలా సులభతరం చేస్తూ ప్రభుత్వ వ్యవస్థను ప్రజల చెంతకు చేరవేసిందన్నారు. అర్హులైన ఏ ఒక్కరు లబ్ధి పొందకుండా మిగిలి పోకూడదన్న లక్ష్యంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ప్రజలకు జవాబు రీతనం ఉండాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సత్వరమే 11 సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వీస్ చార్జీ లేకుండా ఉచితంగానే ధృవపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, మెక్మా సిబ్బంది, వైసీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్‌గా ధనసింగ్



నగరి, జూలై 10 ప్రభాతవార్త: మండల స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్‌గా డి.వి.ధనసింగ్ నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ చిత్తూరు వారి ఉత్తర్వుల మేరకు సోమవారం ఎంపీడీవో లీలామాధవి నుంచి నియామక పత్రాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సాక్షరభారత్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని 2018లో అప్పటి ప్రభుత్వం తొలగించిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రిజగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ-2లో తిరిగి భాగస్వాములను చేస్తూ ఔట్ సోర్సింగ్ ద్వారా మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్‌గా నియమించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వనరులు, పారిశుధ్యం నిర్వహణపై అవగాహన కల్పిస్తానన్నారు.

# ఇంటి పన్నులు చెల్లించని విల్లాలు

-గత నాలుగు సంవత్సరాలు ఇంటిపన్నులు విధించలేదు...పన్నులు చెల్లించలేదు
-చిగురువాడ... వేదాంతపురం గ్రామ పంచాయతీల ఆధాయాలకు భారీగా గండి



తిరుపతిరూరల్, జూలై 10 ప్రభాతవార్త: ధనవంతులు, రాజకీయ నేతలు, అధికారులు, సమాజంలో పలుకుబడి వ్యక్తులు నివాసం ఉండే ఖరీదైన భవంతులు అవి. ఆ భవంతుల యజమానులు ఇంటి పన్నులు చెల్లించడం లేదంటే ఎవ్వరైన అవాక్కు అవ్వాల్సిందే. గేటెడ్ కమ్యూనిటీతో కూడిన గృహ సముదాయాలు, కనురెప్పవాలకుండా 24గంటల పాటు సెక్యూరిటీ, ఇతరాత్ర సదుపాయాలు కలిగి, దాదాపు రూ.2కోట్ల రుపాయాల పైగా ఖరీదు చేసే ఒక్కో భవంతులకు ఇంతవరకు ఆయా గ్రామ పంచాయతీలు ఇంటిపన్నులు విధించనూ లేదు... ఆయా భవంతుల యజమానులు ఇంటి పన్నులు చెల్లించలేదు. తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ, చిగురువాడ పంచాయతీ పరిధిలో, రాయలచెరువు-పచ్చికాపల్లం మొయిన్ రోడ్డుకు అనుకుని విల్లాస్ ఉన్నాయి. ఈ విల్లాస్ నిర్మాణాలు గత 4 సంవత్సరాలు క్రితమే పూర్తి కావడమే కాకుండా సమాజంలోని వివిధ రకాల హోదాల్లో వున్న వ్యక్తులు కొనుగోలు చేసి, నివాసం ఉంటున్నారు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా నివాసాలు ఉన్న, ఖరీదైన భవంతులకు మాత్రం ఇంతవరకు ఇంటి పన్నులు విధించలేదు. సిపిఆర్ విల్లాస్‌లో 83 భవంతులు ఉన్నాయి. అందులో వేదాంతపుం గ్రామ పంచాయతీ పరిధిలోకి 40 భవంతులు ఉండగా చిగురువాడ గ్రామ పంచాయతీ పరిధిలో 43 భవంతులు ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీలో భవంతులు ఉన్నందున, పంచాయతీలు మౌళిక సదుపాయాలు కల్పనకు గాను ఇంటిపన్నులు చెల్లింపు తప్పనిసరి. కొంతమంది పంచాయతీ కార్యధర్శులు తమ పంచాయతీ పరిధిలోని గృహాలకు ఇంటి పన్నులు చెల్లించకపోతే నోటీసులు జారీ చేసి కోర్టులో కేసువేసి ముక్కుపిండి వసూలు చేస్తారు. కానీ దాదాపు రూ.75లక్షల రుపాయాలు ఇంటి పన్నుల రూపంలో పంచాయతీలకు ఆధాయం రావాల్సి ఉన్నా ఎందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదు. తిరుపతిరూరల్ వేదాంతపురంలో ఉన్న విల్లాస్‌కు గతంలో పంచాయతీ కార్యధర్శి పన్నులు విధించటానికి ప్రయత్నం చేసి విఫలమైనారు. అప్పట్లో ఒక్కో విల్లాకు ఇంటి పన్నులు, ఇతరాత్ర రూ.30వేలు రుపాయాలు పన్నులు విధించారు. దీంతో విల్లాస్ యజమానులు సంతృప్తి చెందగా ఇంకా తగ్గించాలని, రాజకీయంగా ఒత్తిడి పెంచడంతో పంచాయతీ కార్యధర్శులు చేతులెత్తేసారు. దీంతో గత మూడు, నాలుగు సంవత్సరాలుగా విల్లాస్ ఇంటి పన్నులు చెల్లించకపోవడంతో ఆయా పంచాయతీల ఆధాయానికి భారీగా గండి పడిందనే చెప్పాలి. ఒక్కో విల్లా సంవత్సరానికి రూ.30వేల రుపాయాలు చొప్పున 83 విల్లాలు ఇంటి పన్నులు చెల్లిస్తే ఆయా గ్రామ పంచాయతీలకు లక్షల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఖరీదైన భవంతులపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి, పంచాయతీల ఆధాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది.

## శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయానికి లక్ష విరాళం



చిట్టమూరు, జులై 10 ప్రభాతవార్త: చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత స్వయంభు శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి వారికి సోమవారం కంఠం వెంకట సుబ్రమణ్యం దంపతులు ఆలయ కమిటీ ఛైర్మన్ సాయిరెడ్డికి లక్షరూపాయిలు విరాళం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన తెలియజేస్తూ దేవస్థానంలో జరుగుతున్నటువంటి ఆలయ అభివృద్ధిలో భాగంగా స్వామి వారి ఆలయంపై సాలహారాల నిర్మాణమునకు కోట గ్రామానికి చెందిన కంఠం వెంకట సుబ్రమణ్యం వారి ధర్మపత్ని ఉషారాణి వారి కుమారుడు షణ్ముఖ సందీప్‌లు లక్ష రూపాయిలు విరాళంను ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ చిల్లకూరు సాయికుమార్ రెడ్డికి అందజేసారు. ఈ సందర్బంగా కుటుంబ సమేతంగా విచ్చేసిన దాత కంఠం వెంకట సుబ్రమణ్యం స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారు వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మూలంరాజు భాను ప్రకాష్ శర్మ, ఆలయ సిబ్బంది సుబ్బరామయ్య, శ్రావణ్ కుమార్‌లు ఉన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా వైద్య శాఖధికారి డాక్టర్ శ్రీహరి**



తిరుపతి, జులై 10, ప్రభాతవార్త : అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్ అందుబాటులో లేనప్పుడు ఎంఎల్ హెచ్‌పిఎస్, సిహెచ్‌ఓలు ధైర్యంగా పని చేసి రోగుల ప్రాణాలు నిలపాలని తిరుపతి జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ డా. శ్రీహరి తెలిపారు. సోమవారం తిరుపతి రుయా ఆసుపత్రి నందు హ్యాండ్స్ ఆన్ ట్రైయినింగ్‌లో భాగంగా 8వ బ్యాచ్ ఎంఎల్‌హెచ్‌పిలకు వారం రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని శ్రీహరి ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తిరుపతి జిల్లాలో పని చేస్తున్న మొత్తం 440 ఎంఎల్‌హెచ్ పిలకు ఒక బ్యాచ్‌కు 40 మంది చొప్పున 11 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ హ్యాండ్స్ ఆన్ ట్రైయినింగ్‌లో ప్రథమ చికిత్స, కట్లు, కుట్లు, పాము కాటు, అన్ని రకాల ఇంజక్షన్లు, ఐవి ఇన్ఫ్యూజన్ గోల్డెన్ టైములో సిపిఆర్ చేయడం తదితర వాటి మీద శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, నోడల్ ఆఫీసర్లు, జోబు, సుధాకర్ నాయక్, ట్రైయినర్స్ ప్రొఫెసర్స్ ఆశాలత, లలితాదేవి, అమిత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోండి



శ్రీకాళహస్తి, జులై 10 ప్రభాతవార్త : పుణ్యక్షేత్రంలో ఉన్న హోటల్ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌సిఆర్‌సి కమిషన్ రాష్ట్ర సభ్యులు శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏవో ఝాన్సీకి వినతిపత్రం అందించారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ డిప్యూటీ కమిషన్ వై.కోటేశ్వరబాబు, ప్రధాన కార్యదర్శి కె.భరత్‌రెడ్డిలు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని దక్షిణకాశీగా పేరుగాంచిన ఆలయానికి నిత్యం వేలాదిమంది భక్తులు దేశ విదేశాల నుంచి వస్తుంటారని అదేవిధంగా స్థానికులు సుమారు 90వేల మంది ఉన్నారని ఆలయానికి వచ్చిన భక్తులందరు ఆహారం కోసం హోటళ్ళపై ఆధారపడుతారని తెలిపారు. ఆహారపదార్థాల తయారీలో కూడా నాసిరకం వస్తువులు వినియోగిస్తున్నారన్నారు. పురపాలకశాఖ అధికారులు కూడా ఆకస్మికదాడులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పిఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు వెంకటేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దామావిజయకుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదూరుబాలాజీరెడ్డి, రాష్ట్ర ఆర్టీఐ ఇన్‌ఛార్జి భరత్‌కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పరిశీలన నిశితంగా ఉండాలి



తిరుపతి,జులై 10ప్రభాతవార్త: తిరుపతి నియోజకవర్గంలో చేపడుతున్న ఓటర్ల జాబితా పరిశీలన నిశితంగా చూడాలని, ఓటర్లు తొలగకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు పరిశీలించాలని తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ తెలిపారు. యువనేత నారాలోకేశ్ చేపట్టిన పాదయాత్ర 2వేల కిలోమీటర్లు విజయవంతంగా పూర్తికావడంతో మద్దతుగా మంగళవారం ఉదయం చేపట్టే ర్యాలీని విజయవంతం చేయడానికి పార్టీనాయకులు తరలిరావాలని ఆమె కోరారు.

## మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్న శ్రీజ మిల్క్



తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 10 ప్రభాతవార్త: సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో 'శ్రీజ' మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ యొక్క 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చిత్తూరు,అనంతపురం జిల్లాల నుండి పెద్ద ఎత్తున మహిళా పాడి రైతులు హాజరయ్యారు.గత పదేళ్లగా సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించిన మహిళా సభ్యులకు 10 కోట్ల రూ॥ల బోనస్,అలాగే స్టైయిన్‌లెస్ స్టీల్ పాల క్యానులను త్వరలో పంపిణీ చేయనున్నట్లు సంస్థ ఛైర్మన్ ప్రకటించారు.శ్రీజను ఒక మేటి సంస్థగా నిలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.1లక్ష 9 వేల మంది సభ్యులు కలిగి బలమైన పునాది కలిగి ప్రపంచంలోని నెంబర్ 1 సంస్థ అయిన శ్రీజ యొక్క ప్రయాణం కేవలం 27 మంది సభ్యులతో ప్రారంభమయిందన్నారు. అనంతరం కంపెనీ సిఈఓ జయతీర్థ చారి మాట్లాడుతూ విభిన్న ప్రాంతాలు, సంస్కృతులు, మతాలకు చెందిన గ్రామీణ మహిళలనందరినీ కలుపుకుని ఒక గొడుగు కిందకు తీసుకు రావడంలో తమ సంస్థ విజయం సాధించిందన్నారు.పక్షానికి 360 కోట్ల రూ॥లు ఇప్పటి వరకు సభ్యులకు సంస్థ చెల్లించిందన్నారు.తాము సేకరించిన పాల విలువలో ప్రతి 100 కు 90 రూ॥లు తిరిగి తమ పాల ఉత్పత్తిదారులకు చెల్లిస్తూ వస్తున్నామన్నారు.శ్రీజ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సం॥లో చిత్రావతి ఫోడర్ అండ్ అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అనే ప్రత్యేక పశుమేత ఎఫ్‌పిఓను ప్రారంభించాలని యోచిస్తోందన్నారు.రాయలసీమ,నెల్లూరు జిల్లా,హైదరాబాద్,చెన్నైలలో 200 పార్లర్లను ఏర్పాటు చేశామన్నారు.రాబోవు 3 ఏళ్లలో మరో 600 పార్లర్లను ఏర్పాటు చేసి వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.త్వరలో తమిళనాడు,కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాలకు విస్తరించడానికి ప్లాన్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో టిస్ మాజీ డైరెక్టర్ డా॥లక్ష్మీలింగం,గ్లోబల్ సిహెచ్‌ఆర్‌ఓ,గ్రాన్యుయల్స్ ఇండియా ఉమారావు,అమర హాస్పిటల్ ఎండి డా॥రమాదేవి,డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లు డిఎంకె తులసి,జ్యోతి,శ్రీజ కంపెనీ ఛైర్మన్ సిద్దారెడ్డిగారి శ్రీదేవి,తదితరులు పాల్గొన్నారు.

## కాలభైరవునికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి,జూలై 10 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అలాగే ఆలయానికి దక్షిణాన సుమారు 8కిలో మీటర్ల దూరంలోని కైలాసగిరుల్లో వెలసిన కాలభైరవ ఆలయంలో అష్టమి, సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాధారణంగా కాలభైరవునికి రాత్రి 11 గంటల తరువాత పూజలు నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో కాలభైరవునికి విశేష పూజలు నిర్వహించారు.ఇటీవల ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పట్టుబట్టి ఈ ఆలయానికి ప్రత్యేక రోడ్లు, అలాగే ఆలయం వద్ద మౌళిక సదుపాయాలు కల్పించి కుంబాభిషేకం జరిపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూడా సోమవారం రాత్రి ఆలయం మూసే సమయంలో కాలభైరవునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుపుతున్నారు. అష్టమి సందర్బంగా శ్రీకాళహస్తి నుంచి భక్తులు విశేష సంఖ్యలో కాలభైరవుని ఆలయానికి చేరుకున్నారు. అక్కడ వెలసినస్వామికి షోడషా భిషేకాలు నిర్వహించారు.

## చంద్రబాబుకు లక్ష మెజారిటీ లక్ష్యంగా కాణిపాకంలో పూజలు



కాణిపాకం, జులై 10 ప్రభాతవార్త: రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత నారా చంద్ర బాబు నాయుడుకు లక్ష మెజారిటీ లక్ష్యంగా కుప్పం నియోజక వర్గంలోని తెలుగు మహిళలు సోమవారం కాణిపాకంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కుప్పం నియోజకవర్గం నుండి సుమారు 100 మంది టీడీపీకి చెందిన తెలుగు మహిళలు కాణిపాకం చేరుకుని చంద్రబాబుకు లక్ష మెజారిటీ రావాలని, ఈనెల 14 నుండి ప్రారంభం కానున్న మినీ మేనిఫెస్టోలోని మహాశక్తికి సంబందించి ప్రచార కార్యక్రమం విజయవంతం కావాలని పూజలు నిర్వహించారు. కుప్పం నుండి కాణిపాకం చేరుకున్న వారికి ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఐరాల మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఎం.లతల ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్న మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో కుప్పం నియోజక వర్గానికి చెందిన కాణిపాకం ఆలయ మాజీ పాలక మండలి సభ్యుడు వెంకటేష్, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, మండల టీడీపీ నాయకులు బాబునాయుడు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## తెలుగు మహిళలు...చల్లటి గాలినిచ్చేది జగనన్ననే ఆదరించాలి

**డిప్యూటీ సీఎం నారాయణస్వామి**



వెదురుకుప్పం, జూలై 10 ప్రభాతవార్త : చల్లని గాలినిచ్చేది ఫ్యాన్ అని అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలు చల్లగా, సుఖసంతోషాలతో జీవనం సాగించాలి అహర్నిశలు కృషి చేస్తున్నా జగనన్నను ఆదరించాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. గడప గడనకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎగువ చవటగుంటలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వెదురుకుప్పం సచివాలయం పరిధిలోని సంతబయలు పంచాయితీ పరిధిలోని చవటగుంట ఎస్టీ కాలనీ, సంతబయలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గడప గడపకు వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాల లబ్ధి అందుతున్న తీరును ప్రశ్నించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోడి రెడ్డి రాజేశ్వరి పెద్ది రెడ్డి, ఎంపీపీ బండి నాగరాణి, జడ్పీటీసీ సుకుమార్, మండల పార్టీ అధ్యక్షులు పద్మనాభ రెడ్డి, మాజీ జడ్పీటిసి బండి గోవర్ధన్ రెడ్డి, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కళ్యాణమస్తు.. షాదీ తోఫా దరఖాస్తులకై తప్పని అవస్థలు

**- కుప్పం మున్సిపాలిటీలో లాగిన్ లేక తిప్పలు !!**




కుప్పం, జూలై 10 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం పేదల వివాహాల కోసం తమవంతు ఆర్థికసాయం అందించేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలకు లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలంటే అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా కుప్పం మున్సిపాలిటీలో ఈ సమస్య నెలకొనడంతో ఈ పథకాల్లో లబ్దికై దరఖాస్తు చేసుకునేందుకు నిత్యం లబ్దిదారులు అటు సచివాలయాలు, ఇటు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోంది. ఈపథకాలకు ప్రభుత్వం నిర్దేశించిన రెండు నెలల గడువు కాస్తా తీరిపోతుండడంతో లబ్దిదారులు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో కేవలం చీలేపల్లి, కుప్పం ఒకటో వార్డు సచివాలయం పరిధిలో మాత్రమే ఈ పథకాలకు సంబంధించిన లాగిన్‌ను ఏర్పాటుచేశారు. మిగతా 10 వార్డు సచివాలయాల పరిధిలో కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాల దరఖాస్తులు సమర్పించేందుకు లాగిన్, పాస్‌వర్డ్ సౌకర్యం ఇంతవరకు కల్పించలేదని తెలిసింది. ఈ లాగిన్ కేటాయించాల్సిన జిల్లా అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సమాచారం. దీంతో ఈ పథకాల కింద ఆయా సచివాలయాల పరిధిలో దరఖాస్తులను తీసుకెళ్తే సచివాలయాల సిబ్బంది లాగిన్ అవకాశం లేదనే కబురు చల్లగా చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాల లబ్దికి కుప్పం మున్సిపాలిటీలోని అన్ని సచివాలయాల్లో లాగిన్ సౌకర్యం కల్పించి లబ్దిదారులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**పంచాయతీ స్వచ్ఛ భారత్ కార్మికులకు...**

## 12 నెలల జీతాలు విడుదల చేయాలని డిమాండ్

తిరుపతి కలెక్టరేట్, జులై 10 ప్రభాతవార్త: తిరుపతి ఏపీ గ్రామ పంచాయితీ స్వచ్ఛ భారత్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసీ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛ భారత వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్వచ్ఛ భారత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులుకు 12 నెలలుగా జీతాల రాక అధిక వడ్డీలకు అప్పులు చేసుకుని అనేక ఇబ్బందులకు పిల్లలకు పుస్తకాలు స్కూల్ ఫీజులు కట్టలేని స్థితిలో కుటుంబాల గొడవ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఈ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోగా ఉదయం 5 గంటల నుండి వీధులు కాలువలు శుభ్రం చేస్తూ తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఎరువులు సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. అనేక రకాలైన పనులు వేలకు పెడుతూ సచివాలయం సిబ్బందులు నిరంతరం వాళ్ళను పనుల్లో పెడుతున్నారు. వారికి జీతం 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి వాడుకోవాలని తర్వాత సర్దుబాటు చేస్తామని తమరి ఆఫీసు నుండి ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర కమిషనర్‌ని గ్రామ సర్పంచులు గాని అమలు చేయలేదు. సర్పంచులను జీతాలు అడిగితే బెదిరిస్తున్నారు. వెంటనే అధికారులు మా సమస్యలు పరిష్కరించి జీతాలు విడుదల చేస్తారని ఆశిస్తున్నామన్నారు.

## 12నుండి కోదండరామస్వామి పవిత్రోత్సవాలు

తిరుమల,జులై10 ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో ఈనెల12వతేదీ నుండి పవిత్రోత్స వాలు ప్రారంభమవుతున్నాయి. ఈపవిత్రోత్స వాల బుక్‌లెట్ ను సోమవారం టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ఆవిష్కరించారు. కోదండరామస్వామి పవిత్రోత్స వాల్లో భాగంగా 12వతేదీ బుధవారం సాయంత్రం అంకురార్పణ జరుగుతుంది. 13వతేదీ గురువారం ఉదయం యాగశాలలో పవిత్ర ప్రతిష్ట, శయనాధివాసం నిర్వహిస్తారు. 14వతేదీ ఉదయం పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 15వతేదీ చివరగా యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్స వాలు పరిసమాప్తమవుతాయి. ప్రతిరోజూ ఉదయం ఉత్స వర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం తిరువీధి ఉత్స వం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ప్రవాసాంధ్రులు కీలకభూమిక పోషించాలి :గాలి భానుప్రకాష్



నగరి, జూలై 10 ప్రభాతవార్త: రాష్ట్ర అభివృద్ధిలో విదేశాల్లో స్థిరపడ్డ ప్రవాసాంధ్రులు కీలక పాత్ర పోషించాలని నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. 23వ తానా మహాసభల్లో భాగంగా అమెరికాలోని ఫిలీడెల్ఫియాలో నిర్వహించిన చిత్తూరు ప్రవాస భారతీయుల సమ్మేళనంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు సతీష్, వేమనతో కలసి పాల్గొన్నారు. విదేశాల్లో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు తమ సొంత దేశం కోసం ఎన్నో రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, వారిని ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎన్నో గ్రామాలను ఎన్ఆర్ఐలు దత్తత తీసుకుని వాటిలో అనేక రకాల అభివృద్ధి కార్యర్యక్రమాలు చేపట్టారని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోతెలుగుదేశం పార్టీ గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాబోయే రోజుల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలను కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీతోనే భవిష్యత్‌తో గ్యారెంటీ లభిస్తుందన్నారు. అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయులందరూ తమ భాగస్వామ్యంతో పాటు తమ బంధువులు, స్నేహితులతో కలసి తెలుగుదేశం ప్రభుత్వ స్థాపన కోసం కృషి చేయాలని కోరారు.



## రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలిని కలిసిన కోలా

శ్రీకాళహస్తి, జూలై 10 ప్రభాతవార్త : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వంలో మహిళా సాధికారతకు మరో నిదర్శనం బిజెపి రాష్ట్రఅధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరిని నియమించడమే అని రాష్ట్ర మీడియా ప్రతినిధి, నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి కోలా.ఆనంద్‌కుమార్ అన్నారు. ఈసందర్బంగా హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛంతో కలసి దుశ్శాలువతో సత్కరించారు.

## శ్రీకాళహస్తి క్షేత్రానికే తలమానికి భూగర్భవిద్యుత్‌లైన్లు



శ్రీకాళహస్తి, జూలై 10 ప్రభాతవార్త : పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో సుమారు రూ.17కోట్లతో చేపట్టిన భూగర్భ విద్యుత్‌లైన్లు పనులు శివయ్య క్షేత్రానికే తలమానికం అని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. ప్రజలకు, మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులను చేపట్టామని వివరించారు. విద్యుత్ సిబ్బందికి రూరల్ ఈఈ వాసురెడ్డి, డిఈఈ సతీష్‌బాబులు పలు సూచనలు చేశారు. నాలుగుమాడా వీధులకు భరద్వాజసదన్ వద్ద ఉన్న విద్యుత్‌సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంటుందని. ఎప్పుడైనా మరమ్మత్తులకు గురైనపుడు ధర్మరాజుల గుడి వద్ద ఉన్న ఉపకేంద్రం నుంచి కూడా విద్యుత్ అందుబాటులోకి తెచ్చి ఈరెండు లైన్లను నాలుగుమాడావీధుల్లోకి అనుసంధానం చేయాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు స్థానికుల సహకారం అందించాలని అధికారులకోరారు. వీరితో పాటు ఎఈఈ నాగరాజు మరియు చెంచుకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

## కష్టాలు, సమస్యలుపై దృష్టి సారించిన లోకేష్

**-తెలుగుయువత కాగడాలతో సంఘీభావం**




తిరుపతి,జులై 10ప్రభాతవార్త: రాష్ట్రంలో వైసిపి అరాచకపాలనతో విసిగిపోయిన ప్రజలను పలకరించి,వారి సమస్యలు, కష్టాలు నేరుగా తెలుసుకునేందుకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారాలోకేష్ యువగళం పాదయాత్ర 2వేల కిలోమీటర్లు విజయవంతం కావడంతో తిరుపతిలో తెలుగుయువత నాయకులు కాగడాల ప్రదర్శన చేశారు. లోకేష్ పాదయాత్ర చేపట్టి అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా అధిగమించి ప్రజల కష్టాలు తెలుసుకున్నారన్నారు. 2వేల కిలోమీటర్లు పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం సాయంత్రం తెలుగుయువత రాష్ట్ర,జిల్లా,తిరుపతి నగర నాయకులు కంకణాల రజనీకాంత్‌నాయుడు, ఆర్‌పి శ్రీనివాసులు, పెరుమాళ్, మధు, శేషాద్రి నాయుడు, కృష్ణయాదవ్, కెవికె ప్రాద్,సందీప్ ,వంశీ, రఫీ, శ్రీనివాస్‌యాదవ్,బాబి,రాఘవ తదితరులు నగరంలో కాగడాలతో ప్రదర్శన చేపట్టారు. లోకేశ్ ఎంతో పట్టుదలతో, సంకల్పంతో ఈ యాత్ర చేపట్టారని తెలిపారు.

## అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

-సమస్యలు పరిష్కరించకుంటే ముప్పు తప్పదు
-రాష్ట్ర ప్రభుత్వానికి సిఐటియు హెచ్చరిక



తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 10 ప్రభాతవార్త: అంగన్వాడీ కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించకుంటే.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ముప్పు తప్పదని అంగన్వాడీ,సిఐటియు నేతలు హెచ్చరించారు.ఈ మేరకు సోమవారం జిల్లాలోని 34 మండలాల నుండి అంగన్వాడీ వర్కర్స్,హెల్పర్స్,మినీ వర్కర్లు సిఐటియు జెండాలు చేతబూని కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.అనంతరం జరిగిన సభను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.మోడీ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నేరపూరిత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు.గత 12 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు.తాము అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే అధిక వేతనాలు ఇచ్చి వారిని ఆదుకుంటామని ప్రగల్బాలు పలికి అధికారంలోకి రాగానే ఆ ఊసే ఎత్తడం లేదని జగన్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు.అంగన్వాడీలతో ఇదే వైఖరి కొనసాగితే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ముప్పు తప్పదని హెచ్చరించారు.అనంతరం ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ,అధ్యక్షురాలు పద్మలీల మాట్లాడుతూ ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్వాడీల ఉద్యోగ భద్రత కోసం,కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్,ఈఎస్ఐ లాంటి సమస్యలు పరిష్కారం కావాలని 10,11 తేదీల్లో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేసినట్లు వారు తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ ఏడాది ఐసిడిఎస్ బడ్జెట్‌ను తగ్గించేసిందని, అంగ న్వాడీలను మరింత వివక్షతతో చూడటం బాధాకరమన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లో భాగంగా 5 లక్షలు,వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమం మంగళవారం సాయంత్రం వరకు కొనసాగుతుందని వారు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్ర హ్మణ్యం, కోశాధికారి కెవిఎస్.ప్రసాదరావు, నేతలు ఆర్.లక్ష్మి, టి.సుబ్రహ్మణ్యం, పార్థసారథి, డివైఎఫ్ఐ నేతలు జయచంద్ర, నరేంద్ర, ఐద్వా నాయకురాళ్లు సాయిలక్ష్మి, జయంతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్,తదితరులు పాల్గొన్నారు.